క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన కార్మికులు



భూపాలపల్లి అర్బన్: సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్(ఐఎ న్టీయూసీ) కార్మికులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల క్రితం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ యూనియన్ ఏరియా కమిటీ ఇన్‌చార్జ్‌గా కొలా నాగేంద్రబాబు(చంటి) నియమితులై య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి కనీస వేతనా లు అందజేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రమణారెడ్డి, బాబు, సందీప్, రమణ కుమార్, బాబు, సంజయ్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



భూపాలపల్లి అర్బన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవ పరిణామ సిద్ధాంత ప్రచారోద్యమం వాల్ పోస్టర్‌ను సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ,, వేల్పుల రాజు, కుమార్, తిరుపతి, రామయ్య పాల్గొన్నారు.

నేడు రాజకీయ నాయకులతో సమావేశం

కాటారం: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు(మంగళవారం) సప్లమెంటరీ డ్రాఫ్ట్ ఓటర్ లిస్టుపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఓటర్ లిస్టుపై రాజకీయ పార్టీల నాయకుల అభ్యంతరాలు, సవరణలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నియామకం

రేగొండ: తెలంగాణ మాల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని రేపాక గ్రామానికి చెందిన పొనగంటి మధుకర్‌ను నియమిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు రంజిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రంజిత్‌కు మధుకర్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భూపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం నైన్‌పాక గ్రామానికి చెందిన అజ్మీరా వెంకటేశ్(22), మరో వ్యక్తి కలసి పెద్దాపూర్ గ్రామంలోని బంధువుల రిసెప్షన్‌కు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈక్రమంలో పెద్దాపూర్ గ్రామ శివారు మలుపు వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. వెంకటేశ్ అక్కడిక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో..

భూపాలపల్లి అర్బన్ : అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మేకల ప్రవీణ్ (32) కొంత కాలంగా అనారోగ్య బారిన పడి ఇంట్లోనే ఉంటున్నట్లు తెలిపారు. ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు.

వరికొయ్యలను కాల్చొద్దు..



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీజ



పొలంలో కొయ్యకాలను కాలుస్తున్న రైతులు

- అవగాహన లేక కాలుస్తున్న అన్నదాతలు
- పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నాశనం

మల్హర్: వరి పంట ముగిశాక పొలాల్లోని కొయ్యలను(గడ్డి)ని రైతులు అక్కడే కాలుస్తున్నారు. దీంతో రెండో సారి వేసే పంటలకు నష్టం వాటిల్లడంతో పాటు అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని అధికారులు తెలుపుతున్న రైతులు పట్టించుకోవడం లేదు. వరిని హార్వెస్టర్ ద్వారా కొయడం వల్ల సాధారణంగా గడ్డి చేనులోనే ఉండిపోతుంది. పశుసంపద తగ్గిపోతుండటంతో రైతులు గడ్డిని తీసుకెళ్లడానికి ఆసక్తి చూపించడం లేదు. పొలంలో వదిలేసిన గడ్డి పొడిదుక్కి దున్నేటప్పుడు నాగళ్లకు అడ్డుగా వస్తుందనో, సాలు సరైన లోతుగా రాదనో దమ్ము (జంబు) వేసిన తరువాత కుళ్లిపోవడానికి చాలా సమయం పడుతుందనో ఇలా రకరకాల అపోహల వల్ల అన్నదాతలు చేన్లలో మిగిలిన గడ్డి, కొయ్యకాళ్లను తగలబెడుతున్నారు.

కాల్చడంతో నష్టాలు

కొయ్యకాళ్లు కాల్చడం వల్ల నేలకు అందాల్సిన సేంద్రీయ పదార్థాలు అందకుండా పోతాయి. అధిక ఉష్ణోగ్రతలు వెలువడి జీవరాశి యుక్తమైన నేలపై పొరల్లో ఉండే మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయి. పొలాల్లో వేసిన పశువుల పేడ ఎరువులు కాలిపోతుయి. అలాగే కొన్ని సార్లు పెద్ద ఎత్తున లేచిన మంటలు అదుపు కాక పక్క పొలాల్లో విస్తరించే అవకాశం ఉంది. దీని వల్ల పంటపొలాల్లోని వ్యవసాయ విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, వైర్లు, పైపుల కాలిపోయే ప్రమాదం కూడా ఉంది.

ఇలా చేస్తే అధిక ప్రయోజనాలు..

పంట ముగిశాక కొయ్యకాల్లను కాల్చకపోవడం వలన వేసవిలో నమోదయ్యే అధిక ఉష్ణోగ్రతల నుంచి నేలను కాపాడుకోవడానికి గడ్డి మాల్చింగ్ లాగా ఉపయోగపడుతుంది. తీవ్రమైన వడగాల్పులకు నేలపై పొర కొట్టుకుపోకుండా కాపాడుతోంది. పచ్చిరొట్టుగా జనుము, జీలుగ, వంటి వాటిని పెంచుకున్నప్పుడు లభించే 40–45రోజుల సమయంలో వరిగడ్డి పూర్తిగా కుళ్లిపోయి నేలలో కలిసిపోతోంది. పంట కాలంలో వేసిన ఎరువుల్లో ధాన్యం దిగుబడికి వాడుకోగా మిగిలిన పోషకాలు కొయ్యకాళ్లల్లోనే నిల్వ ఉండిపోతాయి. కొయ్యకాళ్లను కలియ దున్నడం వల్ల తర్వాత పంటకు ఎరువుగా ఎంతగానో ఉపయోగపడుతోంది. రకరకాల కారణాలతో తగ్గిపోయిన పశు సంపద వల్ల సాగులో ఉన్న భూములకు సరిపడా సేంద్రీయ ఎరువులు లభ్యమవడం లేదు. ఈ నేపథ్యంలో పొలంలోనే ఉత్పత్తి అయ్యే సేంద్రీయ పదార్థాలను కాల్చివేయడం అవివేకమే. ఇప్పటికైన రైతులు వివిధ అపోహలను విడనాడి కొయ్యకాళ్లను కాల్చివేయడం ఆపివేయాలని అధికారులు సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



వరి కొయ్యలను తగలబెట్టకుండా భూమిలో కలియ దున్నడం ద్వారా సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతోంది. వరికొయ్య కాలుకు నిప్పుపెట్టడం ద్వారా గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతాయి. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే కొయ్యలు గడ్డి త్వరగా కుళ్లిపోతాయి. దీంతో ఎరువుగా మారి దిగుబడి కూడా పెరుగుతోంది. ప్రతి క్లస్టర్ పరిధిలో వ్యవసాయ విస్తరణాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

– శ్రీజ, ఏఓ, మల్హర్

ఘనంగా ఏఎమ్మార్ వార్షికోత్సవం



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కాపురం క్యాంపు కార్యాలయంలో ఏఎమ్మార్ వార్షికోత్సవాన్ని అధికారులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా కార్మికులకు, ఉద్యోగులకు వారం రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు, ఉత్తమ కార్మికులకు, ఉద్యోగులకు ఏఎమ్మార్ అధికారులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి, సేఫ్టీ ఆఫీసర్ సురేష్‌బాబు, మేనేజర్ శ్రీనివాస్, హెచ్‌ఆర్ డీజీఎం రవికుమార్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్సై శాఖాన్

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో అయ్యప్ప మాలధారులకు సెకండ్ ఎస్సై శాఖాన్ సోమవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయప్ప స్వామి ఆశీర్వాదంతో ప్రజలు అందరు సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా సమాజంలో కలిసిమెలిసి ఉండాలని కోరారు. గురుస్వాములు గొపగాని రాజేందర్, సంజీవ్, గుర్రం రవి, రాజు, నాగరాజు, నరేష్, సదయ్య, వెల్పుల రాజు కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై దాట్ల కుమారస్వామి

- ఏఎస్సై దాట్ల కుమారస్వామి

టేకుమట్ల: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఏఎస్సై దాట్ల కుమారస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో డయల్ 100, హెల్మెట్ వినియోగం , చోరీల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేసి పోలీసులు సాయం తీసుకోవాలన్నారు. ప్రయాణంలో, పని చేస్తున్న సమయంలో ఎలాంటి ఆపద సమయంలోనైనా కాల్ చేస్తే నిమిషాల్లో మీ వద్ద పోలీసులు ఉంటారని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా వచ్చి అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు మహేందర్, స్వప్న, రాజన్న తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజాబాబు

పలిమెల: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో సీఈఓ రాజాబాబు చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని అన్నారు. ఆయన వెంట రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



నోటుబుక్స్ అందజేస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి ఆధ్వర్యంలో సోమవారం మాజీ జెడ్పీటీసీ అయిత కొమల రాజిరెడ్డి, నాయకులు నోటు పుస్తకాలు, ఎక్కాల పుస్తకాలను ఉచితంగా అందించారు. భవిష్యత్‌లో కూడా పాఠశాలకు తన వంతు సాయం అందిస్తానని రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లెంకుంట కాంప్లెక్స్ హెచ్‌ఎం సుదర్శనం, జంగిడి సమ్మయ్య, జంగిడి శ్రీనివాస్, పోచయ్య, లక్ష్మిరాజు, తాళ్ల లచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు గంగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి పరామర్శ



బియ్యం పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కన్నాయిగూడెం: మండల పరిధిలోని బుట్టాయిగూడెంకు చెందిన ఆర్ఎంపీ సునార్కని సమ్మయ్య భార్య సమ్మక్క ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కావడంతో మండలంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వివిడిగా పరామర్శించి బియ్యం, సరుకులను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు సునార్కని వెంకటయ్య, మాజీ సర్పంచ్ కావిరి పద్మ, దుర్గం రాజుకుమార్, కావిరి నర్సింహారావు, రాజబాబు ౨,రాజు, రమేశ్, పోషయ్య, కుమ్మరి దుర్గారావు, కాంగ్రెస్ నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీరాములు, ముదురుకోల్ల భిక్షపతి ఉన్నారు.

నర్సరీలో మొక్కల పెంపకంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

వాజేడు: మండల పరిధిలోని దూలాపురం గ్రామ పంచాయతీలో నర్సరీలో మొక్కలు పెంచే విధానంపై సోమవారం ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, ఏపీఓ సత్యేందర్ శిక్షణ ఇచ్చారు. మొక్కలను ఎలా పెంచాలి, మొక్కకు మొక్కకు ఎంత దూరం ఉండాలి అనే అంశాలపై ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దళారులకు పత్తి అమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని అమ్ముకోవాలని, దళారులకు పత్తి అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణ శివారులోని కుందూరుపల్లిలో యంఎస్ఆర్ పత్తి మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్లో ధరలు పడిపోతున్న సందర్భంలో పత్తికి మద్దతు ధర అందించే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సీసీఐ కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. ఒక క్వింటా పత్తికి రూ.7521 ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



చిట్యాల: భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ



రేగొండ: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్వేత

- తహసీల్దార్ శ్వేత

రేగొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ వసతి గృహాన్ని తహసీల్దార్ శ్వేత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం పరిశీలించి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజన పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆమె వెంట ఆర్ఐ నరేష్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమేష్ ఉన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి కొడెపాక రఘుపతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, నిల్వ, మిలుగు ఆహారంలో నాణ్యతల తనిఖీ చేపట్టారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలు, హెల్త్ చెకప్ అంశాలపై ఆరా తీశారు. వంట కార్మికులు, పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుమలత, సీఆర్పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం మండల కమిటీ ఎన్నిక



కొమురయ్యను సన్మానిస్తున్న నాయకులు

టేకుమట్ల: మండల కేంద్రంలోని పీఆర్ఎంఆర్ గార్డెన్‌లో యాదవ సంఘం మాజీ మండల అధ్యక్షులు పోతనవేని ఐలయ్య ఆధ్వర్యంలో సోమవారం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీ వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా మాదం కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా కుర్రె మల్లయ్య, ఉపాధ్యక్షులుగా తోడేటి కుమార్, దాసరి కుమారస్వామి, కార్యదర్శులుగా అమ్ముల కుమార్, మద్దెల కుమార్, బుర్గుల లక్ష్మయ్య, కోశాధికారిగా ఎడ్ల రమేశ్, సంయుక్త కార్యదర్శి ఆరెపల్లి తిరుపతి, ముఖ్య సలహాదారులు బండారి చేరాలును ఎన్నుకున్నారు. అనంతరం మండల అధ్యక్షుడు కొమురయ్యను యాదవ సంఘం నాయకులు సన్మానించారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

- ఎంఈఓ కొయ్యడ మల్లయ్య

ఏటూరునాగారం: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎంఈఓ కొయ్యడ మల్లయ్య అన్నారు. సోమవారం మండలంలోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో మంచర్ల పౌల్ట్రీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో తెలుగు, ఇంగ్లీష్ చేతి రాత నోట్ బుక్స్‌లను ఎంఈఓ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు ఇంటి పరిసరాలు చదువులకు నిలయాలుగా మార్చాలని, అనువైన ప్రశాంతమైన వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యార్థులపై అవగాహన, బాధ్యత ఉండాలన్నారు. విద్యార్థుల నడవడికపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి ప్రవీణ్, ఉపాధ్యాయులు టీవీ వీరభద్రం పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాజాత



వాజేడు: అవగాహన కల్పిస్తున్న కళా బృందం



కన్నాయిగూడెంలో..

వాజేడు: మండల పరిధిలోని పెద్ద గొళ్లగూడెం, జగన్నాథపురం, చెరుకూరు గ్రామాల్లో ప్రజాపాలన విజయోత్సవాలపై సోమవారం రహీముద్దీన్ కళాబృందం వారి ఆధ్వర్యంలో కళాజాతా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మార్త రవి, రాగుల శంఖర్, రేల విజయ్, అమ్మ పాట తిరుపతి, గోల్కొండ నరేష్, శ్రీలత, శోభ ఉన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి, ఏటూరు గ్రామల్లో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగాంగా కళాకారులతో కళాజాతా నిర్వహించారు. కళకారుడు గోల్కొండ బుచ్చయ్య ఆధ్వర్యంలో ప్రజలకు ఆటపాటల రూపంలో ప్రభుత్వ పథకాలను వివరించారు. కళాబృదం నాయకులు కనకం రాజేందర్, రాజు, భద్రయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

చిట్యాల: మండలంలోని కై లాపూర్ శివారులోని 206 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొంత మంది అక్రమంగా కబ్జా చేసుకుని సాగు చేసుకుంటున్నారని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ ఆరోపించారు. సోమవారం కబ్జా చేసిన భూమిని పరిశీలించి మాట్లాడారు. మండలంలోని కై లాపూర్ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో జామాయిల్ మొక్కలు నాటి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్న వాటికి బోర్డులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఆయన వెంట నాయకులు శంకర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి రైతులు సన్నద్ధం

- వరి నార్లు పోస్తున్న అన్నదాతలు



బోరునర్సాపురంలో మడిలో వరి విత్తనాలు చల్లుతున్న రైతులు

మంగపేట: మండలంలో యాసంగి వరిపంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వరికోతలు కోసిన రైతులు ముందస్తుగా నాట్లు వేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. వానకాలం బోరుబావుల కింద ముందస్తుగా నాట్లు వేసి పంట కోతదశకు చేరుకోవడంతో రైతులు ఇప్పటికే హార్వెస్టర్లతో కోతలు కోశారు. యాసంగి సైతం ముందస్తుగా నాట్లు వేసేందుకు వరి మడులను తయారుచేసి నార్లు పోస్తున్నారు. ఇప్పటికే మండలంలోని మంగపేట, మల్లూరు, కోమటిపల్లి, నర్సింహాసాగర్, రాజుపేట, అకినేపల్లిమల్లారం తదితర గ్రామాల్లో కొందరు రైతులు వారం రోజుల క్రితమే నార్లు పోశారు. గత యాసంగి మండల వ్యాప్తంగా 13,500 ఎకరాల్లో సాగుచేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెపుతున్నారు. ఈ ఏడాది సుమారు 14,000 ఎకరాల్లో సాగుచేస్తారని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత సాగు చేస్తున్న తీరు చూస్తుంటే అధికారుల అంచనాకు అదనంగా మరో 10,000 వరకు సాగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. యాసంగి సాగును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, అధికారులు స్పందించి ముందుగా వరి సాగుచేసే భూములను, భూసారాన్ని పరీక్షించి సాగుకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలని, మండలంలోని రైతులు కోరుతున్నారు.



మంగపేటలో..